www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

పేదల జీవితాల్లో కొత్త వెలుగులు..
ప్రజాప్రభుత్వం "చేయూత"

పేదల కళ్లలో ఆనందం..
ప్రజాప్రభుత్వ సంక్షేమం
రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి
నూతన చేయూత పింఛన్లు
అర్హులందరికీ పింఛన్లు
అందిస్తామని భరోసా



3

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 290 మంగళవారం 17-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5



సైలెంట్ కరప్షన్..

గుట్టు చప్పుడు కాని అవినీతి

పట్టా భూముల తంతులో కాసుల కక్కుర్తి
నడి గోదావరిలో వ్యవసాయ భూములు
ఇసుక తొలగింపు లో ఎన్నో మతలబులు
గుట్టుచప్పుడు కాకుండా తప్పుడు నివేదికలు
చేతులు మారుతున్న లక్షల్లో ముడుపులు
ఇసుక అక్రమాల వెనుక
వ్యవసాయ శాఖదే పెద్దన్న పాత్ర
పట్టా భూముల అనుమతులు
వెనుక లోగుట్టు ఎవరికెరుక
కలెక్టర్ ని తప్పుదోవ
పట్టించేలా కాగితాల్లోనే కనికట్టు
ఇసుక తొలగింపు అనంతరం...
అక్కడే ది వ్యవసాయం
పట్టా భూముల మాటను పక్కా మోసం

2

ఇసుక మాఫియా అక్రమాల వెనక అనేక శాఖల ప్రత్యక్ష పరోక్ష సహకారం ఉంటుంది అనేది జగమెరిగిన సత్యం. ఇసుక రీచ్ ల నిర్వహణకు సంబంధించి పలు శాఖలకు చెందిన అధికారులు అనుమతులు ఇవ్వాల్సిన నేపథ్యంలో వారు చాప కింద నీరులా మామూళ్లు స్వీకరిస్తూ దొడ్డిదారి అనుమతులకు ద్వారాలు తెరుస్తుంటారు. అయితే ఇసుక అక్రమాలకు సంబంధించి ఎన్నో శాఖల సహకారం ఉన్నప్పటికీ ఒక్క శాఖ మాత్రం భారీగా ముడుపులు తింటూనే బహిర్గతం కాని పరిస్థితి నెలకొంది. ఒక కేటగిరికి సంబంధించిన ఇసుక తవ్వకాల కు సంబంధించిన అనుమతుల ప్రక్రియ వ్యవహారంలో ముందు వరుసలో ఉండే వ్యవసాయ శాఖ అనుమతులకు ముందే ముడుపులు మూటను స్వీకరిస్తున్నప్పటికీ ఆ వ్యవహారం మాత్రం అజ్ఞాతవాసానికే పరిమితమవుతోంది. మిగతా శాఖల విషయాలు పెద్ద ఎత్తున అవినీతి దుమారం రేకెత్తుతున్నప్పటికీ వ్యవసాయ శాఖ మాత్రం పెద్దగా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం.. కానీ పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించిన ప్రక్రియలు నిబంధన అతిక్రమించడం వెనక వ్యవసాయ శాఖ ముందు వరుసలో ఉంటుంది

భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

సైలెంట్ కరప్షన్



గుట్టు చప్పుడు కాని అవినీతి

- పట్టా భూముల తంతులో కాసుల కక్కుర్తి
- నడి గోదావరిలో వ్యవసాయ భూములు
- ఇసుక తొలగింపు లో ఎన్నో మతలబులు
- గుట్టుచప్పుడు కాకుండా తప్పుడు నివేదికలు
- చేతులు మారుతున్న లక్షల్లో ముడుపులు
- ఇసుక అక్రమాల వెనుక వ్యవసాయ శాఖదే పెద్దన్న పాత్ర
- పట్టా భూముల అనుమతులు వెనుక లోగుట్టు ఎవరికెరుక
- కలెక్టర్ ని తప్పుదోవ పట్టించేలా కాగితాల్లోనే కనికట్టు
- ఇసుక తొలగింపు అనంతరం... అక్కడే ది వ్యవసాయం
- పట్టా భూముల మాటను పక్కా మోసం

ఇసుక మాఫియా అక్రమాల వెనక అనేక శాఖల ప్రత్యక్ష పరోక్ష సహకారం ఉంటుంది అనేది జగమెరిగిన సత్యం. ఇసుక లీచ్ ల నిర్వహణకు సంబంధించి పలు శాఖలకు చెందిన అధికారులు అనుమతులు ఇవ్వాల్సిన నేపథ్యంలో వారు చాప కింద నీరులా మామూళ్లు స్వీకరిస్తూ దొడ్డిదారి అనుమతులకు ద్వారాలు తెరుస్తుంటారు. అయితే ఇసుక అక్రమాలకు సంబంధించి ఎన్నో శాఖల సహకారం ఉన్నప్పటికీ ఒక్క శాఖ మాత్రం భారీగా ముడుపులు తింటూనే బహిర్గతం కాని పరిస్థితి నెలకొంది. ఒక కేటగిరికి సంబంధించిన ఇసుక తవ్వకాల కు సంబంధించిన అనుమతుల ప్రక్రియ వ్యవహారంలో ముందు వరుసలో ఉండే వ్యవసాయ శాఖ అనుమతులకు ముందే ముడుపులు మూటను స్వీకరిస్తున్నప్పటికీ ఆ వ్యవహారం మాత్రం అజ్ఞాతవాసానికే పరిమితమవుతోంది. మిగతా శాఖల విషయాలు పెద్ద ఎత్తున అవినీతి దుమారం రేకెత్తుతున్నప్పటికీ వ్యవసాయ శాఖ మాత్రం పెద్దగా ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం.. కానీ పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించిన ప్రక్రియలు నిబంధన అతిక్రమించడం వెనక వ్యవసాయ శాఖ ముందు వరుసలో ఉంటుంది



సైలెంట్ కరప్షన్

పట్టా భూముల్లో ఇసుక తొలగింపు ప్రక్రియ వెనక వ్యవసాయ శాఖ సైలెంట్ కరప్షన్ కు పాల్పడుతుందనే అభిప్రాయాలు ఉన్నాయి. మండల స్థాయి వ్యవసాయ అధికారులు పట్టా భూముల ఇసుక తవ్వకానికి సంబంధించిన అనుమతుల విషయంలో పారదర్శకతను పక్కనపెట్టి అవినీతి పాపానికి ఒడిగడుతున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇసుక అక్రమాలకు సంబంధించి ఇతర శాఖలు ముడుపుల వ్యవహారాలు బహిర్గతమవుతున్నప్పటికీ వ్యవసాయ శాఖ అవినీతి మాత్రం ఎక్కడా ప్రచారంలోకి రాదు. కానీ పట్టా భూముల ఇసుక తవ్వకాల ప్రక్రియ వెనక జరిగే అవినీతి తంతు వ్యవసాయ శాఖ నుండి ప్రారంభం కావడం విశేషం. నడి గోదావరిలో సైతం వ్యవసాయం చేసుకోవచ్చనే అనైతిక అంశాన్ని వ్యవసాయ శాఖ నిర్ధారిస్తూ ఇసుక మాఫియాకు సహకరిస్తూ పోవ డం వెనక ఆ శాఖ అధికారులకు లక్షల్లో ముడుపులు అందుతున్నాయి అనేది చర్చనీయాంశంగా మారుతుంది



భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

ములుగు జిల్లాలో వివిధ మండలాల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించిన వ్యవహారాలు పక్కాగా అవినీతికి కేరాఫ్ గా మారిపోయాయి. ప్రధానంగా పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు సంబంధించిన ప్రక్రియలు వ్యవసాయ శాఖ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తుంది. గోదావరి పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయ భూమిలో వరదల కారణంగా ఇసుక మేటలు వేస్తాయి. ఈ క్రమంలో ఇసుక మేటల కారణంగా ఆయా భూములు వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉండవు. అయితే ఆ ఇసుక మేటలను తొలగించే క్రమంలో వివిధ శాఖల అనుమతులు తప్పనిసరి అందులో ముందు వరుసలో అనుమతులు పరంగా వ్యవసాయ శాఖ ఉంటుంది. అయితే పట్టా భూముల్లో ఇసుక తొలగింపుకు సంబంధించి అనేక పారదర్శకమైన నిబంధనలు ఉంటాయి. పట్టా భూముల్లో ఇసుకతవ్వాలంటే తొలుత వ్యవసాయ శాఖ నుండి అనుమతి పొందాలి వ్యవసాయ అధికారి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ఇసుక మేటలు తొలగింపు అనంతరం తిరిగి ఆ భూమి వ్యవసాయానికి ఉపయోగ పడతాయనే నివేదిక ఇస్తేనే ఇసుక రీచ్ ల మంజూరీ ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఈ అరుదైన అవకాశాన్ని ములుగు జిల్లాలోని ఇసుక రీచ్ ను నిర్వహించబడుతున్న మండలాల్లో వ్యవసాయ శాఖ అధికారులు తమ ఆర్థికపరమైన అభివృద్ధి కోసం వాడుకుంటున్నారు. ఇసుక తొలగించకుండా మేటలు వేసిన భూముల్లో వ్యవసాయం చేయడం సాధ్యం కాదనే విషయంపై స్పష్టత ఇస్తూ అక్కడ ఇసుక తొలగింపుకు సంబంధించిన కీలకమైన సాంకేతికపరమైన నివేదికను వ్యవసాయ శాఖ ఇస్తేనే ఇసుక తరలింపు ఫైలు ముందుకు సాగుతుంది.

అయితే ములుగు జిల్లాలో గత కొన్నేళ్లుగా ఇసుక మేటలు వేసిన పట్టా భూముల్లో ఇసుక తొలగింపు వ్యవహారానికి సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు భారీగానే ఆర్థికంగా లబ్ధి పొందుతూ దొడ్డిదారి అనుమతిరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా పట్టా భూములకు ఇసుక తరలింపు అనుమతులు ఇవ్వడంలో వ్యవసాయ శాఖ ఉరుకుల పరుగులు పెట్టడం వెనక Adarsh ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఒకే సర్వేనెంబర్ కు సంబంధించిన పట్టా భూముల్లో ఇసుక మేటలను తొలగించే ప్రక్రియ వ్యవహారం దొడ్డిదారులో వెళుతుంది. కొన్నేళ్లుగా పట్టా భూములు ఇసుక తొలగింపు అనంతరం ఏ ఒక్క ఎకరంలో కూడా వ్యవసాయం చేసిన దాఖలాలు లేవు. పైగా ప్రతి ఏడాది అవే పట్టా భూముల్లో ఇసుక తొలగింపు ప్రక్రియకు వ్యవసాయ శాఖ అనుమతులు ఇస్తూనే వస్తుంది. ఇలా తప్పుడు నివేదికలు అనుమతులు ఇచ్చినందుకుగాను వ్యవసాయ శాఖ అధికారులకు ఇసుక మాఫియా లక్షల్లో ముడుపులు ముట్ట చెబుతుంది. మరోవైపు గోదావరి నదిలో సైతం వ్యవసాయోగ్యమైన పట్టా భూములు ఉన్నట్లుగా సృష్టిస్తూ అక్కడ కూడా ఇసుక తవ్వకాలకు వ్యవసాయ శాఖ ద్వారా మాఫియా అనుమతులు పొందడం విశేషం. ఇసుక మేటలు వేసిన భూములను తిరిగి సాగుభూములుగా మార్చే లక్ష్యంతో ఇసుక తొలగింపు ప్రక్రియకు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఇక్కడ అందుకు విరుద్ధమైన పరిస్థితులు. ఇక్కడ ఇసుక తవ్వకాలు కేవలం వ్యాపార దృక్పథానికి పరిమితం కావడంతో ప్రతి ఏడాది అవే పట్టా భూములు ఇసుక తొలగింపు జరుగుతూనే ఉంటుంది ఇందుకు వ్యవసాయ శాఖ సహకరిస్తూనే పోతుంది. వ్యవసాయ శాఖ ఇచ్చే ధ్రువీకరణకు అత్యంత ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లాలో కొందరు అగ్రికల్చర్ ఆఫీసర్స్ కి మాఫియా ద్వారా కాసుల వర్షం కురుస్తుంది. లక్షల్లో ముడుపులు తీసుకుంటూ తప్పుడు నిర్ధారణ నివేదికలు ఇస్తూ పోతున్న వ్యవసాయ శాఖ సాక్షాత్తు కలెక్టర్ సైతం మోసం చేస్తుందనే విమర్శలు ఉన్నాయి. సాగు పునరుద్ధరణ లేకుండా ప్రతి ఏడాది అవే పట్టా భూములు ఇసుక తొలగిస్తూనే పోతున్న పరిస్థితిని చూస్తుంటే పట్టా భూముల ఇసుక తొలగింపు ప్రక్రియ వెనక భారీ అవినీతి కుంభకోణం జరుగుతోందని అర్థమవుతుంది.



ఛలో హైదరాబాద్ – డిసెంబర్ 9 కరపత్రం ఆవిష్కరణ

- **లక్ష విల్లంబులతో.. లక్ష్యసాధనకై.**
- **హైదరాబాద్ కేంద్రంగా ఆదివాసీ గర్జన**
- **రిజర్వేషన్ల దోపిడీకి వ్యతిరేకంగా**
- **గిరిజన ఐక్యతను చాటి చెప్పే దిశగా**
- **లక్షలాదిగా తరలిరావాలని తుడుం దెబ్బ పిలుపు**
- **రాజధాని లో భారీ బహిరంగ సభ**
- **చలో హైదరాబాద్ కరపత్రం విడుదల**

భద్రాద్రి న్యూస్ వెంకటాపురం

డిసెంబర్ 9న హైదరాబాద్ రాజధాని నడిబొడ్డున లక్షలాది ఆదివాసీలతో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలనే లక్ష్యంతో వెంకటాపురం మండల కేంద్రంలోని రహదారులు భవనాలు అతిథి గృహ ఆవరణలో చలో హైదరాబాద్ కరపత్రాన్ని సోమవారం తుడుం దెబ్బ నాయకులు ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంగా తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యాక్షులు పొడెం బాబు గారు మాట్లాడుతూ.. డిసెంబర్ 9న నిర్వహించనున్న "ఛలో హైదరాబాద్" కార్యక్రమానికి వెంకటాపురం మండలంలోని ప్రతి ఆదివాసి గూడెం నుండి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన ఆదివాసి ప్రజలను చైతన్యపరిచి, భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చేలా మండల, జిల్లా, రాష్ట్ర నాయకత్వం చైతన్యం చేయాలని అన్నారు. ఆదివాసుల హక్కుల సాధన కోసం ప్రతి గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని, డిసెంబర్ 9న లక్షలాది మంది ఆదివాసులు హైదరాబాద్‌కు చేరుకుని తమ ఐక్యతను చాటాలని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆదివాసులు మనుగడ దిన దిన గండంగా మారిందన్నారు. అభివృద్ధి పేరిట ఆదివాసుల గొంతు కోసే కార్యక్రమాలు ప్రభుత్వాలు చేపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ నీళ్లు, నిధులు, ఉద్యోగాలు తెలంగాణలోని మైదాన ప్రాంతాలు దోపిడీ చేసేలా ప్రభుత్వాల కుట్రలు ఉన్నాయని మండిపడ్డారు.

మరోపక్క 50 ఏళ్లుగా లంబాడాలు అక్రమంగా ఎస్టి రిజర్వేషన్లు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జోనల్ విధానం పేరుతో ఏజెన్సీ ప్రాంతం ఉద్యోగాలను తెలంగాణ



ప్రభుత్వం దోపిడీ చేస్తుందని అన్నారు. ఆదివాసులపై ఆటవిశాఖ దాడులను ఆపేందుకు, గోదావరి జలాల దోపిడీని అరికట్టేందుకు, సింగరేణిలో ఉద్యోగాల దోపిడిని ప్రశ్నించేందుకు, విద్యుత్ దోపిడిని, పేపర్ బోర్డులో వాటాను ఎండగట్టేందుకు, 1/70 చట్టాన్ని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాలపై రాష్ట్ర రాజధానిలో గళం విప్పుతున్న తుడుం దెబ్బ చేపట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సద్దులు కట్టుకొని, డోలీలు విల్లంబులతో తరలిరావాలని పిలుపునిచ్చారు.

డివిజన్ ఉపాధ్యక్షులుగా సురేష్..

కరపత్రం ఆవిష్కరణ అనంతరం తుడుం దెబ్బ డివిజన్ ఉపాధ్యక్షులుగా మనుబోతుల సురేష్ ఎన్నుకయ్యారు. జాతీయ ఉపాధ్యక్షులు పొడెం బాబు గారు తుడుం దెబ్బ కండువాను కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ప్రతి గ్రామంలో ఆదివాసి ప్రజలను చైతన్య చేసి చట్టాలు అమలు కోసం కృషి చేయాలని ఎంపికైన నాయకత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులుషే బాలకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రేగ గణేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం చంటి, వెంకటాపురం మండల అధ్యక్షుడు పూనెం శ్రీకాంత్, ఉపాధ్యక్షులు రేగ నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ విచ్చ సురేష్, ఆదివాసి విద్యార్థి సంఘం మండల ప్రధాన కార్యదర్శి పాయం శశికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్షిక అనిల్, కార్యవర్గ సభ్యులు మేకల మహేష్, బొచ్చ నరసింహ మూర్తి, సబక రాజు తదితరులు పాల్గొన్నారు.

సిపియస్ రద్దు చేయాలి

- **టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆది మూలం వెంకట్ డిమాండ్**

ముడిగొండ, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్) :-



ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని టియస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ డిమాండ్ చేశారు. ముదిగొండలో జరుగుతున్న టియస్ యుటిఎఫ్ జిల్లా మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం కాలయాపన చేయకుండా పిఆర్సీ రిపోర్ట్ తెప్పించుకుని అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించుటకు రెండు వేల కోట్ల రూపాయలు ప్రతినెలా విడుదల చేయాలని కోరారు.గురుకల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని ,010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వివిధ రకాల పేర్లతో పాఠశాలలు స్థాపించడం కాకుండా ఉన్నప్రభుత్వ పాఠశాలను గరిష్టంగా అభివృద్ధి చేసి, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని సూచించారు. 2024 డిఎస్సి ఉపాధ్యాయులకు రెండవ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరారు. సిపిఎస్ ఉపాధ్యాయుల డిఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

పీఆర్సీ పై కాలయాపన తగదు

ప్రభుత్వం తెలంగాణ రెండవ పిఆర్సీ అమలుపై విపరీతమైన కాలయాపన చేస్తుందని, వెంటనే పిఆర్సి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్ష, కార్యదర్శులు దుర్గాభవాని, పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే పిఆర్సీ ఇవ్వకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగ ,ఉపాధ్యాయ పెన్షనర్లు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, అసంతృప్తి తొలగాలంటే పిఆర్సీని వెంటనే ప్రకటించడం మినహా ప్రభుత్వము దగ్గర వేరే దారి లేదని తెలియజేశారు. 40 నెలల కాలంగా ఆలస్యమైన పిఆర్సీ గతంలో ఎప్పుడూ లేదని విమర్శించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో మీనమేషాలు లెక్కిస్తుందని, ఉద్యోగులు సమాజంలో భాగం అని గ్రహించాలని హితవు పలికారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో ఇదే విధమైన కాలయాపన చేస్తే వచ్చే ఎన్నికల్లో ఇబ్బంది ఎదుర్కొంటుందని తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే పిఆర్సీని ప్రకటించడంతో పాటు, సిపిఎస్ రద్దు చేయడం, పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిర్ణీత కాలపట్టిక రూపొందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు పేరుతో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. యాప్ ల భారం తగ్గించి, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని కోరారు. సమావేశం కింది తీర్మానాలు చేసింది. జేఏసీ కి ఇచ్చిన హామీ మేరకు వెంటనే పిఆర్సి నివేదిక తెప్పించాలని, సిపిఎస్ విధానం రద్దు చేయాలని, 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ ని విడుదల చేయాలని, సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి డైట్ లెక్చరర్లు, ఎంఈఓ, డిప్యూటీఇఓ పదోన్నతులను ఇవ్వాలని, కేజీబీవీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, గురుకుల ఉపాధ్యాయులకు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 హెడ్ ద్వారా వేతనాలు చెల్లిస్తూ, హెల్త్ కార్డులు ఇవ్వాలని ,ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్, పీఈటి పోస్టులు అప్గ్రేడ్ చేసి పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, నెలకు ₹2,000 కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులకు విడుదల చేయాలని, పాఠశాలలకు కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్లను నియమించాలని, విద్యార్థులకు సరిపడా నోటు పుస్తకాలను, వర్క్ బుక్ లను ,టెస్ట్ పుస్తకాలను అందించాలని తీర్మానించారు.

ఈ మహాసభలో టీఎస్ యుటీఎఫ్ నాయకులు వెంకన్న, షమి, రాంబాబు, రాందాస్,నాగేశ్వరరావు , రామారావు,నర్సయ్య, పెనమాక సురేష్, వలీ, ఉద్దండ్, పద్మ, నిర్మలాకుమారి, విజయ్, ప్రశాంతి,రామకృష్ణ, కోటేశ్వరరావు,సుధాకర్, లివిన్,ఎల్లయ్య, దామోదర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.





ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు అంతం లేదా?

- **ఏపీలో పాఠశాల విద్యార్థినిపై దాడి.. తెలంగాణలో జూలూరుపాడులో నర్సింగ్ విద్యార్థిని హత్య**
- **మహిళలు, బాలికల భద్రతపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.. నేరస్థులకు కఠిన శిక్షలు విధించాలి**
- **ప్రతి ఆడపిల్ల భద్రత కోసం లక్షల గొంతులు ఒక్కటవ్వాలి: ఏఎండిఆర్ ఫౌండేషన్ ఆదిల్**

కొత్తగూడెం, నవంబర్ 16 (భద్రాద్రిన్యూస్):-



మహిళలు, బాలికలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఏఎండిఆర్ ఫౌండేషన్ ఆదిల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా రాప్తాడు పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంలో నర్సింగ్ విద్యార్థిని ఇంద్రపల్లి హరిణి హత్య ఘటనలు విద్యార్థినుల భద్రతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని పేర్కొన్నారు. స్పష్టమైన ఆధారాలు ఉన్నపటికీ శిక్షలు వేయడంలో జరుగుతున్న తాత్సరం వల్ల ఆడపిల్లపై అఘాత్యాలకి అంతు లేకుండా పోతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడపిల్లలను చదివించి ఉన్నత స్థానాలకు చేర్చాలని చెబుతున్న తరుణంలో వారిపై దాడులు, హత్యలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, విద్యాసంస్థలపై ఉందన్నారు. జూలూరుపాడు మండలంలో హరిణి హత్య ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు, బాలికల రక్షణకు దేశంలో అనేక కఠిన చట్టాలు ఉన్నప్పటికీ నేరాలు కొనసాగుతుండటం ఆందోళనకరమని ఆదిల్ అన్నారు. చట్టాలను సమర్థంగా అమలు చేయడంతో పాటు ఫిర్యాదు నమోదు, దర్యాప్తు, విచారణ ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన చట్టపరమైన మార్పులు చేపట్టి నేరస్థులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను కోరారు. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థినుల రక్షణకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదిల్ సూచించారు. విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా పెంచడంతో పాటు వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. బాలికలకు ఆత్మరక్షణ, హక్కులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతి ఆడపిల్ల భద్రత కోసం లక్షల గొంతులు ఒక్కటవ్వాలని ఏఎండిఆర్ ఫౌండేషన్ ఆదిల్ పిలుపునిచ్చారు. ఆడపిల్లనే ప్రశ్నించే ధోరణిని విడనాడి నేరస్థులను ప్రశ్నించాలని, బాధిత కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని అన్నారు. మహిళల భద్రత ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. మహిళలకు భద్రత కల్పించలేని అభివృద్ధి ఎవరి కోసం? అని ప్రశ్నించారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని, నేరస్థుల్లో చట్టం పట్ల భయం కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి బాలిక భయంలేకుండా చదువుకునే, ప్రతి మహిళ ఆత్మగౌరవంతో జీవించే వాతావరణం కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆదిల్ పేర్కొన్నారు.

గిరిజనుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

- **ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్**

భద్రాచలం టౌన్, భద్రాద్రి న్యూస్ :



మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలనుండి గిరిజన దర్బార్ లో అర్జీలు సమర్పించడానికి వచ్చే గిరిజన కుటుంబాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఐ టి డి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అధికారిక పనులపై వెళ్లి అందుబాటులో లేనందున వివిధ సమస్యల గురించి గిరిజన దర్బార్ లో విన్నవించడానికి వచ్చిన గిరిజనుల నుండి ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఆర్ సి ఓ గురుకులం అరుణకుమారి, ఏడిఎంహెచ్ఓ సైదులు, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ తో కలిసి యూనిట్ అధికారుల సమక్షంలో ఆయన అర్జీలు స్వీకరించారు. గిరిజనులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు. గిరిజన దర్బార్ లో వచ్చిన అర్జీలు అన్ని ప్రత్యేకమైన రిజిస్టర్లో మరియు ఆన్లైన్ ద్వారా నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా తప్పనిసరిగా ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పవర్ వేణు, హెచ్ ఎన్ టి సి ఉదయ్ కుమార్, మేనేజర్ ఆదినారాయణ, పివిటిజి అధికారి గన్యా నాయక్, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి, ఇతర విభాగాలకు చెందిన సిబ్బంది, మోహన్, నాగేశ్వరరావు, జోగారావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





పేదల జీవితాల్లో కొత్త వెలుగులు.. ప్రజాప్రభుత్వం "చేయూత"

- పేదల జీవితాల్లో కొత్త వెలుగులు.. ప్రజాప్రభుత్వం "చేయూత"
- పేదల కళ్లలో ఆనందం.. ప్రజాప్రభుత్వ సంక్షేమం
- రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి నూతన చేయూత పింఛన్లు
- పింఛన్ల మంజూరులో మహిళలకు పెద్దపీట.. 3.5 లక్షల మంది మహిళలకు ఆర్థిక భరోసా
- అర్హులందరికీ పింఛన్లు అందిస్తామని భరోసా
- రాష్ట్రంలో తొలిసారిగా తలసేమియా బాధితులకు చేయూత పింఛన్లు
- రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా సీఎం చర్యలు
- మహిళా సంఘాల ద్వారా స్వయం ఉపాధికి ప్రోత్సాహం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క

భద్రాద్రి న్యూస్ ములుగు





నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

సోమవారం ములుగు మండలం ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ములుగు, వెంకటాపూర్ మండలాలు, ములుగు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావుతో కలిసి నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 4.5 లక్షల మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో సుమారు 3.5 లక్షల మంది మహిళలే ఉన్నారని, పింఛన్ల మంజూరులో మహిళలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత కల్పించిందన్నారు. మరో 13 వేల మంది నుంచి దరఖాస్తులు అందాయని తెలిపారు. అర్హత ఉండి ఇప్పటికీ పింఛన్లు అందని వారి దరఖాస్తులను పరిశీలించి తప్పకుండా పింఛన్ల మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.

ములుగు జిల్లాలో అర్హులైన వారికి పింఛన్లు అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన సమయంలో ప్రజల నుంచి స్వయంగా దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా పింఛన్ల ద్వారా భరోసా కల్పిస్తున్నామన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అర్హులను గుర్తించి పింఛన్లు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగి సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి అన్నారు. మహిళా సంఘాలకు రూ.75 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులను మహిళల పేరిట మంజూరు చేస్తూ వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయంతో పాటు మహిళా సంఘాలకు బస్సులను కేటాయిస్తూ ఆదాయ వనరులను పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధ మహిళలకు సైతం మహిళా సంఘాల్లో సభ్యత్వం కల్పించి, రుణ సదుపాయాలు, జీవనోపాధి అవకాశాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కుటుంబ సభ్యుల ఆదరణ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధ మహిళలకు సంఘాల ద్వారా అండగా నిలుస్తున్నామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు అందిస్తూ వస్త్ర దుకాణాలు, కిరాణా దుకాణాల నిర్వహణ, కోళ్ల పెంపకం, మేకల పెంపకం వంటి స్వయం ఉపాధి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిమెంట్ కంపెనీలతో చర్చించి రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించడంతో పాటు తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు.

కుటుంబ సంపాదన సభ్యుడిని కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించి ఆయా కుటుంబాలకు అండగా నిలవనున్నట్లు పేర్కొన్నారు. మహిళలు కష్టాలను అధిగమించి ఆర్థికంగా ఎదగాలని, కుటుంబాలను బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇంచర్ల గ్రామానికి చెందిన మల్లక్కను ఉదాహరణగా పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులకు అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా చదవడం, రాయడం నేర్పిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది మహిళలు రాత పరీక్షల్లో పాల్గొన్నట్లు తెలిపారు. బ్యాంకు లావాదేవీలు నిర్వహించుకోవడానికి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి మహిళల్లో అక్షరాస్యత పెంపొందించడం ఎంతో అవసరమన్నారు.

రాష్ట్రంలో తొలిసారిగా రక్త మార్పిడి అవసరమయ్యే తలసేమియా బాధితులకు చేయూత పింఛన్లు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం వంటి సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర రహదారులు, గిరిజన గూడేల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చి పనులు చేపడతామని మంత్రి తెలిపారు. మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, కుటుంబాల అభివృద్ధితో గ్రామాలు ప్రగతి సాధిస్తాయని మంత్రి సీతక్క అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్డుడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లాలో మొత్తం 4,262 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. మండలాల వారీగా ఏటూరునాగారంలో 485 మందికి, గోవిందరావుపేటలో 497 మందికి, కన్నాయిగూడెంలో 81 మందికి, మల్లంపల్లిలో 219 మందికి, మంగపేటలో 667 మందికి, ములుగులో 390 మందికి, తాడ్వాయిలో 340 మందికి, వెంకటాపూర్‌లో 396 మందికి, వెంకటాపురంలో 515 మందికి, వాజేడులో 470 మందికి, ములుగు మున్సిపాలిటీ పరిధిలో 202 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరైనట్లు వివరించారు. పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను ఎంపీడీఓలు పరిశీలించిన అనంతరం డీఆర్డీఓ ఆమోదంతో అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నేడు ములుగు, వెంకటాపూర్ మండలాలు, ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 988 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వులను అందజేస్తున్నామని తెలిపారు.

అనంతరం మంత్రి దనసరి అనసూయ సీతక్క మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారికి నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, నేతన్నలు, గీతన్నలతో పాటు తలసేమియా బాధితులకు సైతం పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ములుగు జిల్లాలో మూడు రోజుల పాటు అన్ని మండలాల్లో పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామన్నారు. సిద్ధిపేట నుంచి మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు, బీమా సదుపాయాలతో పాటు 'అమ్మకు అక్షరమాల' కార్యక్రమం ద్వారా అక్షరాస్యతను పెంపొందిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో చేరి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ములుగు, వెంకటాపూర్ మండలాల్లో గ్రామాల వారీగా, ములుగు మున్సిపాలిటీ పరిధిలో వార్డుల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వులను అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా, డీఆర్డీఓ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్, షాహిన్, స్థానిక సర్పంచ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణే లక్ష్యంగా
సింగరేణిలో ప్రత్యేక శిక్షణ

- సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ సమర్థవంతమైన అమలుకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం
- జీరో హార్మ్స్ లక్ష్య సాధనకు అధికారులకు అవగాహన

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్):

సింగరేణి సంస్థలో ప్రమాద రహిత పని వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ (ఎస్ఎంపీ) అమలుపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కొత్తగూడెం ఏరియాలో ప్రారంభించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లందు, సత్తుపల్లి ఏరియాలకు చెందిన అధికారులు, వివిధ విభాగాల ప్రతినిధులు, ఎస్ఎంపీ బృంద సభ్యులకు భద్రతా నిర్వహణపై అవగాహన కల్పించనున్నారు.

ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్. వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గనుల్లో జరిగే ప్రమాదాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. కార్మికులందరూ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నవంబర్ 16 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు ఐదు బ్యాచులుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆయా ఏరియాల్లోని గనులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులతో పాటు ఎస్ఎంపీ బృంద సభ్యులకు శిక్షణ అందించనున్నారు. గనుల్లో ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించడం, ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టడం, ఉద్యోగుల భద్రతను నిర్ధారించడం, జీరో హార్మ్స్ లక్ష్యాన్ని సాధించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఉద్యోగి సురక్షితంగా విధులు నిర్వహించేలా ప్రమాద రహిత పని వాతావరణాన్ని ఏర్పాటు చేయడమే సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎం. గోవిందరావు, ఏజీఎం (ఈఅండ్ఎం) వి. రామకృష్ణ, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కె. రాములు, ఐఎన్‌టీయూసీ నాయకుడు సీహెచ్. రాజయ్య, డీజీఎం ఆర్జీ 1 జి.వి. విజయ్ కుమార్, జీవీటీసీ మేనేజర్ జి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్ కు
స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని ఎంపిక

- ఇద్దరు విద్యార్థులకు రాష్ట్రస్థాయి మెడల్స్
- చిన్నారులను అభినందించిన పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్ప కృష్ణ చైతన్య

-ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 16(భద్రాద్రిన్యూస్):-

వచ్చేనెల 5వ తేదీన బెంగళూరులో జరిగే జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు స్మార్ట్ కిడ్జ్ విద్యార్థిని పసుపులేటి వీక్ష ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్ప కృష్ణ చైతన్య తెలిపారు. ఈనెల 13వ తేదీన హైదరాబాద్లో జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలలో పాఠశాలకు చెందిన పసుపులేటి వీక్ష సిల్వర్ మెడల్, బ్రాంజ్ మెడల్ గెల్చుకోగా మరో విద్యార్థిని పసుపులేటి శ్రీనిక బ్రాంజ్ మెడల్ గెల్చుకున్నారు. రాష్ట్రస్థాయిలో బ్రాంజ్,సిల్వర్ మెడల్స్ గెలుచుకున్న పసుపులేటి వీక్షను జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక చేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన, రాష్ట్రస్థాయి స్కేటింగ్లో ప్రతిభ కనబరిచిన పసుపులేటి వీక్ష, పసుపులేటి శ్రీనికలను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్ప కృష్ణ చైతన్య సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్ప కృష్ణ చైతన్య మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను చదువుతోపాటు క్రీడా,సాంస్కృతిక విషయాలలో తీర్చిదిద్దడం వల్లనే జాతీయ స్థాయిలో పాఠశాల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్ప సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





పాల్వంచలో కేటీపీఎస్ ఎనిమిదో దశ ఏర్పాటు చేయాలి

- 800×2 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కోసం మంత్రులకు సాధన కమిటీ వినతి
- మంత్రులు పొంగులేటి, తుమ్మలలను కలిసిన కమిటీ సభ్యులు
- వినతిపత్రాల సమర్పణలో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్):

పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రం (కేటీపీఎస్) ఎనిమిదో దశలో భాగంగా 800×2 మెగావాట్ల సామర్థ్యంతో నూతన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సాధన కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కమిటీ సభ్యులతో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

ఆదివారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని, సోమవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి కేటీపీఎస్ ఎనిమిదో దశ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సాధన కమిటీ సభ్యులు, కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పాల్వంచలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అన్ని వనరులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన భూమి, నీరు, బొగ్గు, ఇతర ముడి సరుకులు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు.

గతంలో పాల్వంచ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. ఈ ప్రాంతంలో నూతన విద్యుత్ కర్మాగారాల ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, కేటీపీఎస్ ఎనిమిదో దశ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రులను కోరారు.



అర్హులైన సింగరేణి ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించాలి

- పర్సనల్ విభాగం అధికారులతో జీఎం జి.వి. కిరణ్ కుమార్ సమీక్ష
- ఔట్‌సోర్సింగ్ కార్మికులకు లాభాల బోనస్ వెంటనే చెల్లించాలి
- చెల్లింపుల్లో జాప్యం చేసే కాంట్రాక్టర్లతో మాట్లాడాలని ఆదేశం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్):



సింగరేణి సంస్థలో అర్హులైన ఉద్యోగులకు నిర్ణీత సమయంలో పదోన్నతులు కల్పించడంతో పాటు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు లాభాల బోనస్ చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం జి.వి. కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్ నుంచి సోమవారం అన్ని ఏరియాల పర్సనల్ విభాగం అధిపతులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఏరియాల వారీగా అర్హులైన ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు నిర్ణీత సమయంలో టైమ్ రేటెడ్, క్యాడర్ స్కీమ్ విధానాల్లో కల్పించాల్సిన పదోన్నతులపై సుదీర్ఘంగా చర్చించారు. పదోన్నతుల ప్రక్రియలో జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చెల్లించాల్సిన లాభాల బోనస్‌పై సమీక్షిస్తూ, ఇప్పటివరకు బోనస్ చెల్లించని కాంట్రాక్టర్లతో మాట్లాడి వెంటనే చెల్లించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం జి.వి. కిరణ్ కుమార్‌తో పాటు డీజీఎంలు (పర్సనల్) ఎస్. వెంకటేశ్వరరావు, బి. రాజగోపాల్, డీవైపీఎం వి. దేవేందర్ రెడ్డి, అన్ని ఏరియాలకు చెందిన పర్సనల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ముగిసిన 'చారుగుళ్ల డిస్కాన్–2026'

- సేవా దృక్పథంతో సమాజ నిర్మాణమే వాసవి క్లబ్స్ ధ్యేయం: డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్
- నూతన జిల్లా గవర్నర్‌గా ధారా మల్లికార్జునరావు ఎన్నిక
- విశిష్ట సేవలందించిన క్లబ్బులు, సభ్యులకు అవార్డుల ప్రదానం

భద్రాచలం, నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్):









వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ V106A పదో వార్షిక జిల్లా సదస్సు 'చారుగుళ్ల డిస్కాన్-2026' ఆదివారం భద్రాచలంలో అంగరంగ వైభవంగా జరిగింది. వాసవి క్లబ్ భద్రాచలం ఆతిథ్యంలో సూపర్ బజార్ సెంటర్‌లోని శ్రీ రామభద్ర నిలయం (రాజుల సత్రం) వేదికగా నిర్వహించిన ఈ మహాసభకు డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఫస్ట్ లేడీ ఆఫ్ ది డిస్ట్రిక్ట్ చారుగుళ్ల వాణి సీతారత్నకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సెక్రటరీ (సర్వీస్ యాక్టివిటీస్) జూలూరి రమేష్ బాబు, సదస్సు పరిశీలకుడిగా ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విట్టా దురయ్య, గౌరవ అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరయ్యారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ వాసవి క్లబ్స్ నిర్వహిస్తున్న నిస్వార్థ సేవా కార్యక్రమాలను అభినందించారు. గత ఐదేళ్లుగా ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి పర్వదినాల్లో భద్రాచలానికి వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఏటా 20 వేల వాటర్ బాటిళ్లను పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. గోదావరి వరదల సమయంలో నిరాశ్రయులైన బాధితులకు అన్నదానం ద్వారా ఆహారం అందించి ఆదుకున్నారని గుర్తుచేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి ఆపద వచ్చినా సేవా కార్యక్రమాలకు వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ ముందుంటారని పేర్కొన్నారు.

సేవే జీవన విధానం కావాలి

సభాధ్యక్షుడు, డిస్ట్రిక్ట్ గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సేవ అనేది కేవలం ఒక కార్యక్రమానికే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవన విధానంగా మారాలని అన్నారు. 'లెట్స్ వర్క్ టుగెదర్' అనే నినాదంతో సమాజంలోని పేదలకు అండగా నిలవడమే వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. సమష్టి కృషితో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని సభ్యులకు పిలుపునిచ్చారు.

సేవా పథకాలపై వివరించిన జూలూరి రమేష్ బాబు

ముఖ్య అతిథి జూలూరి రమేష్ బాబు మాట్లాడుతూ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ 65 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సిద్ధ వెంకట సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో పలు బృహత్తర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీ కేఏస్పీ, స్వయం ఉపాధి, సరస్వతి విద్యా నిధి, శాశ్వత ప్రాజెక్టులు, మహాప్రస్థానం, దివ్యాంగులకు వీల్‌చైర్లు, కృత్రిమ అవయవాల పంపిణీ, వాసవి స్వయంవరం, యువతకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ, శతమానం భవతి వంటి కార్యక్రమాలను వివరించారు.

నూతన గవర్నర్‌గా ధారా మల్లికార్జునరావు

సదస్సులో క్యాబినెట్ ట్రెజరర్ ఉడతా నగేష్ కుమార్ ఈ ఏడాదికి సంబంధించిన సమగ్ర బడ్జెట్ నివేదికను సమర్పించారు. సభ్యత్వ రుసుములు, జిల్లా నిర్వహణ ఖర్చులు, ఇతర ఆర్థిక వివరాలను సభ ముందుంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సదస్సు పరిశీలకుడు విట్టా దురయ్య తన పరిశీలనా నివేదికను సమర్పిస్తూ జిల్లా పరిధిలోని క్లబ్బులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు.

ఎన్నికల అధికారి కొత్త వెంకటేశ్వరరావు ఎన్నికల నివేదికను సమర్పించి డిస్ట్రిక్ట్ నూతన గవర్నర్‌గా ధారా మల్లికార్జునరావును అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన గవర్నర్ ధారా మల్లికార్జునరావు చేత ప్రస్తుత గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రతిభావంతులకు పురస్కారాలు

జిల్లా పరిధిలో విశిష్ట సేవా కార్యక్రమాలు నిర్వహించిన క్లబ్బులు, సభ్యులకు ప్రత్యేక గుర్తింపు అవార్డులను ప్రదానం చేశారు. ఎర్లీ బర్డ్, మ్యాన్ మైలేజ్, బెస్ట్ కపుల్, బెస్ట్ డ్రెస్డ్ వాసవియన్, బెస్ట్ డ్రెస్డ్ వాసవియన్ లేడీ, హయ్యెస్ట్ రిజిస్టర్డ్, బెస్ట్ స్క్రాప్‌బుక్, బెస్ట్ ఫోటో ఆల్బమ్, బెస్ట్ మామ్, బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్ తదితర విభాగాల్లో అవార్డులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ అడ్మినిస్ట్రేషన్ చింతల వినోద్ కుమార్, క్యాబినెట్ సెక్రటరీ సర్వీసెస్ రేపాక డి. రాజ మనోహర్, క్యాబినెట్ ట్రెజరర్ ఉడతా నగేష్ కుమార్, వైస్ గవర్నర్ కొత్త రమేష్, కాన్ఫరెన్స్ చైర్మన్, వాసవి క్లబ్ భద్రాచలం అధ్యక్షుడు వనమా కిరణ్ కుమార్, కాన్ఫరెన్స్ కోచైర్మన్లు చారుగుళ్ల వెంకట నాగభూషణం, చారుగుళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు, రీజియన్ చైర్మన్లు, కార్యదర్శులు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఇన్‌చార్జులు, జిల్లా అధికారులు, జోన్ చైర్మన్లు, జిల్లా పరిధిలోని 47 క్లబ్బుల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, వాసవియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

కాపుల ఐక్యతే ప్రధాన ఎజెండా

- వన సమారాధనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ

ఖమ్మం ప్రతినిధి, నవంబరు 16(భద్రాద్రిన్యూస్):-



సామాజికంగా, రాజకీయంగా క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్న మున్నూరు కాపు కుటుంబ సభ్యుల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా మున్నూరు కాపు సంక్షేమ సంఘం మనుగడ సాగిస్తోందని, ఇందుకు కాపుల ఐక్యతే ప్రధాన ఎజెండా అని తెలంగాణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండాల కృష్ణ పేర్కొన్నారు. సంక్షేమ సంఘం, కాపు జేఏసీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కాపు వన సమారాధనకు విచ్చేసి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో ప్రకటించారు. ఈక్రమంలో కాపుల ఐక్యత దిశగా కలిసి వచ్చే సానుకూల శక్తులను కలుపుకుని ముందుకు సాగాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. జిల్లాలో కాపు కులస్తులకు ఎలాంటి ఆపద వచ్చినా రాజకీయాలకు, వర్గాలకు అతీతంగా ఆదుకోవడానికి, వెన్నుదన్నుగా నిలవడానికి సంక్షేమ సంఘం అనునిత్యం పని చేస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ కార్యాచరణ దిశగా సభ్యత్వ నమోదు ప్రక్రియ, అన్ని నియోజకవర్గ స్థాయిల్లో కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాపు కార్తీక వన సమారాధనకు అతిథులుగా విచ్చేసి విజయవంతం చేసిన ఏపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు, కాపు జేఏసీ చైర్మన్ చందు జనార్ధన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. అలాగే జిల్లాకి చెందిన కాపు నేతలు లక్కినేని రఘు, బచ్చు విజయ్ కుమార్, లక్కినేని సుధీర్, ఆకుల మూర్తి, పిన్ని కోటేశ్వరరావు, తోట కనకరావు, గుండా బ్రహ్మం, కనకం భద్రయ్య, ఎర్ర జ్ఞానేశ్, మాటేటి కిరణ్, ముగాల శ్రీను, పసుపులేటి శ్రీనివాసరావు, కోయలు వెంకన్న, సత్యనారాయణ, జేఏసీ నాయకులు బచ్చు మధు, మడూరి సైదారావు,యర్రా అప్పారావు, రాపర్తి రాజా, నరాల నరేష్, మాటేటి రవి తదితరుల కృషిని మరువలేనని వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

పల్లె నుండి ఢిల్లీ దాక.. కొప్పుల బిడ్డకు జాతీయ కీర్తి

- "విద్యా రత్న "తో మెరిసిన కొండేటి సురేందర్ రెడ్డి
- కొండేటి సురేందర్ రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'విద్యా రత్న' అవార్డు
- విద్యా సేవలకు జాతీయ గుర్తింపు..
- బహుజన సాహిత్య అకాడమీ అరుదైన పురస్కారం
- నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషికి దక్కిన గౌరవం

శాయంపేట,భద్రాద్రి న్యూస్

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త,వరంగల్ డిఫెన్స్ అకాడమీ అధినేత కొండేటి సురేందర్ రెడ్డికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది.విద్యా రంగంలో విశేష సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చూపుతున్న చొరవకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన 'విద్యా రత్న' జాతీయ అవార్డు ఆయనను వరించింది. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి వేదికపై గుర్తింపు పొందడం కొప్పుల గ్రామానికే గర్వకారణంగా నిలిచింది. ఆదివారం (నవంబర్ 15, 2026) న్యూఢిల్లీలోని కరోల్‌బాగ్‌లో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ మహాసభలో ఈ పురస్కారాన్ని అందజేశారు.బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) నేషనల్ కమిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా కొండేటి సురేందర్ రెడ్డి మెమెంటో అందుకుని ఘనంగా సత్కారం పొందారు.

పేద విద్యార్థుల చదువుకు పెద్దన్నగా అండ..

విద్యార్థుల భవిష్యత్తే సమాజ అభివృద్ధికి పునాది అనే నమ్మకంతో కొండేటి సురేందర్ రెడ్డి విద్యా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు.ఫీజుల రాయితీలు కల్పించడం,పుస్తకాలు అందించడం, ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం వంటి సేవా కార్యక్రమాలతో పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల ఉన్నత చదువులకు అడ్డంకిగా మారకూడదనే సంకల్పంతో తన వంతు సహకారం అందిస్తూ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ,సేవా దృక్పథం,మృదుస్వభావంతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు.

విద్యతో పాటు సామాజిక సేవలోనూ ముందంజ...

ఉమ్మడి వరంగల్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తూ విద్యా రంగంలో ప్రత్యేక ముద్ర వేస్తున్నారు. వృత్తిపరమైన బాధ్యతలను నిర్వర్తిస్తూనే సామాజిక బాధ్యతకు ప్రాధాన్యతనిస్తూ నిరుపేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్నారు.విద్య ప్రతి ఒక్కరికీ అందాల్సిన హక్కు అనే ఆశయంతో ఆయన చేస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొప్పుల నుంచి ఢిల్లీ వరకు..

గ్రామానికి గర్వకారణం...

శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన వ్యక్తి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడంతో గ్రామస్థుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.ఒక గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యావేత్త తన సేవా కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా శాయంపేట మండల, కొప్పుల గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు,మిత్రులు, తెలంగాణ రాష్ట్ర అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యులు, వివిధ విద్యాసంస్థల అధినేతలు కొండేటి సురేందర్ రెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.



నిరుద్యోగ యువతకు అండగా జిల్లా గ్రంథాలయ సంస్థ

- చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా చొరవతో పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రత్యేక ప్రేరణ తరగతి
- పరీక్షల ప్రిపరేషన్, సమయపాలనపై నిపుణుల దిశానిర్దేశం
- కార్యక్రమానికి హాజరైన సుమారు 400 మంది నిరుద్యోగ యువత

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్):



నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించి, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా జిల్లా గ్రంథాలయ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ప్రత్యేక ప్రేరణ తరగతిని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ మానసిక శాస్త్ర అధ్యాపకుడు, పోటీ పరీక్షల నిపుణుడు తాళ్లూరి సృజన్ కుమార్ హాజరై యువతకు దిశానిర్దేశం చేశారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్, పరీక్షా విధానం, ప్రిపరేషన్, నిరంతర సాధన, సమాధానాల ప్రజెంటేషన్, సమయ నిర్వహణ వంటి అంశాలపై విలువైన సూచనలు అందించారు. ప్రణాళికాబద్ధమైన చదువు, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చని వివరించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తగినంత నిద్ర, పౌష్టికాహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని వివరించారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అభ్యర్థులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు నిపుణుల మార్గదర్శకత్వం అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతకు మెరుగైన పఠన వాతావరణం, అవసరమైన గ్రంథాలయ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ప్రభుత్వ ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్ 1 లైబ్రేరియన్ సీహెచ్. మాల్సూర్, గ్రేడ్ 3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, కార్యాలయ సిబ్బంది, సుమారు 400 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

'నెల నెల వెన్నెల' కార్యక్రమానికి సుడా చైర్మన్ దంపతులు

- ముఖ్య అతిథులుగా హాజరైన పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, ఇన్నుమతి
- ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేసిన కమిటీ సభ్యులు

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 15 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 'నెల నెల వెన్నెల' సాంస్కృతిక కార్యక్రమానికి ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, ఆయన సతీమణి ఇన్నుమతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

సాహిత్యం, సంగీతం, కళలు, సంస్కృతిని ప్రోత్సహిస్తూ కళాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 'నెల నెల వెన్నెల' కార్యక్రమం చక్కని వేదికగా నిలుస్తోందని ఈ సందర్భంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు కళలు, సాహిత్యంపై ప్రజల్లో ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు.

అనంతరం నెల నెల వెన్నెల కమిటీ సభ్యులు ముఖ్య అతిథులైన పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ దంపతులకు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఈ కార్యక్రమంలో నెల నెల వెన్నెల కమిటీ అధ్యక్షులు, సభ్యులు, నిర్వాహకులు, సాహితీవేత్తలు, కళాకారులు, సాంస్కృతిక అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





మ్యూజియం సందర్శనతో విద్యార్థుల్లో విజ్ఞాన వికాసం

- ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల సైన్స్, పురావస్తు ప్రదర్శనశాలలను సందర్శించిన రెజోనెన్స్ విద్యార్థులు
- ప్రత్యక్ష పరిశీలనతో శాస్త్రీయ, చారిత్రక అంశాలపై అవగాహన

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 16 (భద్రాద్రి న్యూస్):





విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తి, చారిత్రక అంశాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా రెజోనెన్స్ పాఠశాల శ్రీనివాసనగర్ విద్యార్థులు ఖమ్మంలోని శ్రీ రామ భక్త గెంటెల నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్) సందర్శించారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు కళాశాలలోని సైన్స్, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం, పురావస్తు ప్రదర్శనశాలలను సందర్శించి విశేషాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. ఈ విద్యా సందర్శన విద్యార్థులకు విజ్ఞానదాయకంగా, ఉత్సాహభరితంగా సాగింది. పాఠ్యపుస్తకాల్లో చదివిన శాస్త్రీయ అంశాలు, జీవరాశుల నమూనాలు, వృక్షశాస్త్ర విశేషాలు, పురాతన అవశేషాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం విద్యార్థులకు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని, చరిత్రపై అవగాహనను పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. సైన్స్ ప్రయోగాలు, వృక్ష, జంతుశాస్త్ర విశేషాలు, ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే పురావస్తు ప్రదర్శనశాలల సందర్శన విద్యార్థుల అభ్యసనకు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ ఇలాంటి విద్యా విహార యాత్రలు విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు పరిశోధనా భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మ్యూజియంలోని పురాతన అవశేషాలు, జీవరాశుల నమూనాలు, వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు.